# ౧

# ఆ ఉగాది మళ్లీ వస్తుందా!

ఈ ఉగాదికి మన పెళ్ళయి ఎన్నేళ్ళయినట్టూ? 1- ఈ వెళ్ళి పోయిన సంవత్సరాలన్నీ అలానవ్వుతూ పలకరించి ఎక్కడకువెళ్ళినట్టూ? కలకాలం నిలిచిపోయేవి కొన్ని కొన్ని భ్రమలూ జ్ఞాపకాలే గదటండీ! ఎందుకలా నవ్వుతూ చూస్తారు? మనకు పెళ్ళయి - ఉండండి! మనకు పెళ్ళయిన ఆరేడు నెలలకేగా శ్రావణమాసంలో స్వరాజ్యం వచ్చిందీ. అప్పుడు నాకు పన్నెండోయేడు - పన్నెండోయేట పెళ్ళయితే పదహారేళ్ళకేగా, నానిగాడు పుట్టిందీ? ఇప్పుడు యీ ప్లవంగ ఉగాదికి చంటి దానికి ఎనిమిది నెలలూ వెడతాయి. అబ్బో ఇరవై సంవత్సరాలే .... మీరు నేనూగా ఉన్న మనల్ని మనంగా మార్చేసిన ఇరవై ఉగాదులూ ఎక్కడకు వెళ్ళినట్టు చెప్మా! నిన్న గాక మొన్న పల్లకీలో తల వొంచుకు కూర్చున్నట్టూ. గడప దగ్గర పేర్లు చెప్పినట్టూ, పేరంటాళ్ళు మనకేసి చూసినట్టూ మీరు నాకేసి చూసి నవ్వి నా చిటికెన వ్రేలు నొక్కినట్టూ.... ఇలా ఎన్నో ఎన్నో జ్ఞాపకాలు...ఈ జ్ఞాపకాల మధ్యన మీ నవ్వుమొహం గుర్తుకొస్తే కొత్త పెళ్ళి కూతురిలా సిగ్గుపడకపోయినా మనసేవిటో ఊరికే-పరవశించి పోతుంది.

నా మొహం-నేనేవి చదువుకున్నాననీ? ఫస్టుఫారం ఫేలయానని నన్ను వెక్కిరిస్తూంటారుగా! మీరు చదువుకుని వచ్చి నన్ను పుస్తకాలు చదవమనీ పాటలూ అవి పాడమనీ చంపుకుతినేవారు గుర్తుందా! అప్పుడు నాకు చదువుమీదకు మనసెలా వెడుతుంది? మీ మొహంకేసి చూస్తూ మురిసిపోతూండేదాన్ని.

అప్పుడు ఉగాదికి మొదటిసారి మీ రొచ్చారు గుర్తుందా? తలుపు తీసింది నేనే- ఎవరో అనుకుని మొహంమీదకు టార్చివేశాను. అప్పుడు మీరని తెలియగానే గుండె ఝల్లుమంది. ఎవరే అంటే నా నోటి లోంచి మాట వస్తేనా?

అవాళ తలంటి పోసుకుందుకు రమ్మని నేనే పిలిచాను. అమ్మనన్ను పులుసు పోయమని చెప్పింది. నాకు సిగ్గేసింది. మీరు కళ్లు మూసుకున్నప్పుడు పనిపిల్ల చేతిలో పులుసు గిన్నె పెట్టేసి పారిపోయాను. మీరు పనిపిల్ల కాలు నొక్కారటగా - అది గిన్నెపారేసి పారిపోయింది.

మీకు కోపం వచ్చి నాతో మాట్లాడటంమానేశారు. ఫలహారం చేయనని, బట్టలు కట్టుకోనని అలిగారు. అమ్మ నా మీద కోప్పడింది. నేను ఏడుస్తూ పడుకున్నాను.

అప్పుడు నాన్న దాలయ్య బండి కట్టించి ఎద్దులబండిమీద పెనుగొండ మనిద్దర్నీ సినిమాకు పంపించాడు. అప్పుడు మనం చూసిన బాలరాజు సినిమాలో బాలరాజులానే మీరు నాక్కనిపించే వారు.

నేను పూలు కోసుకోవాలని వెళ్ళి గుళ్ళో తోటలో చెరువు మెట్లమీద మా స్నేహితురాలితో కబుర్లు చెబుతూ కూర్చున్నానని నా చెవి మెలిపెట్టారు. గుర్తుందా?

మీరు దొంగతనంగా సిగరెట్ల కోసం కాలవ గట్టంట పై ఊరికి షికారుగా వెళ్ళి ఎంత చీకటి పడ్డా రాకపోయేసరికి నా గుండె గబగబ ఎలా కొట్టుకుందనీ? ఆ కాలవ గట్టంట నా మనసు మీ వెనకాలే ఎలాపరిగెట్టిందో నే నిప్పుడు చెప్పలేను.

కొత్తబట్టలు పట్టుకొని నన్ను రాసుకుంటూ మీరు వెళ్ళినప్పుడు. నా తలలోని మల్లెచెండును మీరు కొంటిగా లాగి నా జడను పట్టుకు గుంజినపుడూ, నా నెత్తిమీద పన్నీరుజల్లి. నా మెడకు మంచిగంధం పూసి, నా బుగ్గను చిటికేసి, వెళ్ళి వస్తానని మీ రన్నపుడూ నిజంగా పండగ ఇంత తొందరగా అయిందేమా అనిపించి మీరు వెళ్ళిపోతున్నందుకు నాకళ్ళలో నీళ్లు చిమ్మి నాకు చెప్పరాని ఉడుకుమోతుతనం వచ్చేసింది.

ఏమండీ మళ్లీ అలాటి ఉగాది మనకు వస్తుందంటారా?

పోన్లెండి మన అమ్మాయికి పెళ్ళవుతుంది. మనింటికి అల్లుడొస్తాడు. చిన్న చిన్న పేచీలు. కొసరికొసరి అలగటాలూ అవన్నీ చూస్తూ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటూ కలగానైనా బ్రతకవచ్చు!

ఉమ, భారతి, సీత, సుబ్బు, సీను, రాము యింతమంది పుట్టుకొస్తారని కలగన్నామా? ఈ మోహాలన్నీ నవ్వుతూ కలకలా తిరుగుతూంటే జీవితం చేదుచేదుగా ఉప్పుప్పగా పుల్లగా తీయగా ఎన్నో ఎన్నెన్నో మధుర స్మృతుల్ని రేపుతుంది.

ఏమండీ ఆ యిరవై ఏళ్ళక్రితం వచ్చిన ఉగాది మళ్ళీ ఎలా వస్తుంది?

## రేపటి ఆకాశంలో ఆశల హరివిల్లు

వాడెవడో సప్తసముద్రాల్ని ఈదేట్ట: ఈ సంసారం ఈదమనండి చూస్తాను?తెచ్చి పడెయ్యటం తెచ్చిపడేస్తారు ఉన్నదాంట్లో... యాచాకిరీ ఎవరు చేస్తారు? తెల్లారుతోందంటే భయం వేస్తోంది? పనివాళ్ళు మరీ బరి తెగించి పోయారు. ఓ రోజు వస్తే ఓరోజు రారు. ఆ చిన్న ముండ నిన్నగాక మొన్న పుట్టింది. నాలుగు గంటలకే లేచి కూర్చుంటుంది. "తై"మని